కొండెక్కిన చికెన్ ధర

ప్రజాశక్తి - పాలకొల్లు

మండుటెండతోపాటు పట్టణంలో చికెన్ ధర కొండెక్కింది. పది రోజుల క్రితం వరకూ కిలో రూ.200 నుంచి రూ.220 వరకూ ఉన్న చికెన్ ధర ఆదివారం రూ.270 నుంచి రూ.300 వరకూ ఎగబాకింది. దీంతో మాంసాహారులు పెరిగిన ధరలకు గగ్గోలు పెడుతున్నారు. ఎండల ప్రభావంతో ఈ వారం కిలో ధర రూ.300 దాటుతుందని వ్యాపారులు చెబుతున్నారు. కోడి గుడ్డు ధర కూడా వారం రోజుల ముందు రూ.5 ఉండేది. అయితే ఎండకు కోళ్లు ఎక్కువగా చనిపోవడంతో కోడిగుడ్డు రేటు కూడా రూ.6కు పెరిగింది.

విక్రయానికి సిద్ధంగా ఉన్న చికెన్

ఆచంటలో విరిగి పడిన చెట్టు

ఏలూరుపాడు వంతెన వద్ద ఈదురుగాలులకు విరిగిన చెట్టుకొమ్మలు

ఆకివీడులో విరిగిన చెట్టు కొమ్మ

ఈదురుగాలులు.. చిరు జల్లులు

మారిన వాతావరణంతో ప్రజలు ఊరట

ప్రజాశక్తి - పెనుమంట్ర

వాతావరణంలో ఆదివారం మధ్యాహ్నం అనూహ్య మార్పులు చోటుచేసుకుని ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. దీనికి ఈదురుగాలులు తోడవ్వడంతో జనం కొంత ఇబ్బంది పడ్డారు. వాతావరణం చల్లబడటంతో చిన్నారులు, వృద్ధులు సేదదీరారు. ఈదురుగాలులకు వెలగలేరు, ఆలమూరు, భట్లమగుటూరు, ఓడూరు, నెలమూరు, పెనుమంట్ర, బ్రాహ్మణచెరువు, మాముడూరు, జుత్తిగ, నత్తారామేశ్వరంతోపాటు పలు గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకూ అంతరాయం ఏర్పడింది.

ఆచంట: మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై బలంగా ఈదురుగాలులు వీచాయి. దీంతో వాతావరణం కాస్త చల్లబడింది. నాలుగు రోజులుగా విపరీతమైన ఉక్కబోత, వడగాల్పులతో అల్లాడిన ప్రజలు కొంత ఉపశమనం పొందారు. గాలులకు ఆచంట-మార్టేరు ఆర్అండ్బి రహదారిలో భారీ వృక్షం నేలకొరిగి విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మొగల్తూరు: మండలంలోని గ్రామాలలో ఆదివారం ఉదయం ఎండ తీవ్రతకు రహదారులన్నీ నిర్మానుష్యమయ్యాయి. రోహిణి కార్తె ప్రభావంతో నాలుగు రోజులుగా అధిక ఉక్కబోతతో ప్రజలు విలవిల్లాడారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. అయితే సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతోపాటు చిరు జల్లులు పడ్డాయి.

పాలకొల్లు రూరల్: మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురు గాలులు వీచాయి. వాతావరణం చల్లబడటంతో జనం సేదతీరారు.

పెనుగొండలో విరిగిన చెట్టు

కాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం బలమైన ఈదురుగాలులు వీచాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏలూరుపాడు, జక్కరం, పెదఅమిరం గ్రామాల్లో మెయిన్‌రోడ్డులో చెట్టు కొమ్మలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఆకివీడు: మండలంలో ఆదివారం సాయంత్రం ఐదున్నర గంటలకు ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై బలమైన ఈదురు గాలులు వీచాయి. చిరు జల్లులు పడ్డాయి. ఆకాశం మేఘావృతం కావడంతో ఆక్వా రైతులు, వరి రైతులు ఆందోళన చెందుతున్నారు.సాధారణ ప్రజానీకం వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు.

పెనుగొండ : ఆదివారం భారీ స్థాయిలో ఈదురుగాలులు వీయడంతో పలు చోట్ల కూలిపోయాయి. ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు ఆందోళన చెందారు.

పాలకొల్లు : పట్టణంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి గాలి దుమ్ముతో గాలులు వీచాయి. పలు చోట్ల చెట్టు కొమ్మలు విరిగాయి. తేలికపాటి వర్షం కూడా పడింది. రోడ్లపై వేసిన ధాన్యం రాశుల బరకాలు గాలికి ఎగిరి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మచ్చలేని ప్రజాప్రతినిధి అలుగు చిత్తరంజన్

అమరుల స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం
మత్స్యపురిపాలెంలో చిత్తరంజన్ 25వ వర్ధంతి, అమరజీవుల సంస్మరణ సభ

ప్రజాశక్తి - వీరవాసరం

సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం నేత, ఆచంట మాజీ ఎంఎల్ఎ అలుగు చిత్తరంజన్ మచ్చలేని ప్రజాప్రతినిధి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. అమరజీవుల స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మత్స్యపురిపాలెంలో అలుగు చిత్తరంజన్ 25వ వర్ధంతి, అమర జీవుల సంస్మరణ సభ ఆదివారం సాయంత్రం నిర్వహించారు. తొలుత సిపిఎం పతాకాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆవిష్కరించారు. అనంతరం అలుగు చిత్తరంజన్ చిత్రపటానికి సీతారాం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిత్తరంజన్ వర్ధంతి, అమర జీవుల సంస్మరణ సభకు సిపిఎం మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్త సీతారాం మాట్లాడుతూ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో మత్స్యపురిపాలెం కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారన్నారు. 25 మంది కమ్యూనిస్టులు ఈ గ్రామంలోనే అమరులయ్యారని గుర్తు చేశారు. జుత్తిగ నరసింహమూర్తి, చిత్తరంజన్‌లతో కలిసి తాను యువజన సంఘంలో పని చేశానని గుర్తు చేశారు. చిత్తరంజన్ ఎంఎల్ఎ కాకముందే ప్రజా పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారన్నారు. 1985లో సిపిఎం తరపున ఆచంట నుంచి ఎంఎల్ఎ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించిన చిత్తరంజన్ అవినీతి రహితంగా, నిస్వార్థంగా ప్రజా సంక్షేమానికి కృషి చేశారన్నారు. ఐదేళ్ల తర్వాత గుండెకు సంబంధించిన ఇబ్బంది రావడంతో సిపిఎం, ప్రజాసంఘాల బాధ్యతలు చూశారన్నారు. ప్రపంచంలో ఎన్ని రాజకీయ పార్టీలున్నా వారు అందిస్తున్న పథకాలు కమ్యూనిస్టుల పోరాటాల ఫలితమేనన్నారు. ఢిల్లీలో కరోనా కన్నా భయంకరమైన వ్యక్తి ఉన్నారని, అది మోడీ అని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హోరంగా దెబ్బతీస్తున్నా రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు స్వప్రయోజనాల కోసం మోడీని వెనకేసుకొస్తూ ప్రజాప్రయోజనాలను తాకట్టు పెడుతున్నాయని విమర్శించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో మార్పులు చేసి రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బిజెపి కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. అమరుల స్ఫూర్తితో వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ భూమి కోసం, కూలి కోసం, వృత్తి రక్షణ, పేదల హక్కుల కోసం కమ్యూనిస్టుపార్టీ ఉధృత పోరాటాలు నిర్వహించిందన్నారు. మత్స్యపురిపాలెంతోపాటు స్థానికంగా ఉన్న దళితపేటలు కూడా కమ్యూనిస్టుల వైపు ఉండి కీలకపాత్ర పోషించారన్నారు. చిత్తరంజన్ ఆశయ సాధనకు ప్రతిఒక్కకూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆచంట మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ సిపిఎంకు ఎంతో ప్రాముఖ్యత, విశిష్టత ఉందన్నారు. మత్స్యపురిపాలెం ఎంతోమంది కమ్యూనిస్టు యోధులు అందించిందని గుర్తు చేశారు. జంగారెడ్డిగూడెం ప్రియదర్శిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అలుగు ఆనందశేఖర్ మాట్లాడుతూ గ్రామంలో అలుగు చిత్తరంజన్, అలుగు సుదర్శనం విగ్రహాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జుత్తిగ నరసింహమూర్తి, జంగారెడ్డిగూడేనికి చెందిన ప్రముఖ న్యాయవాది మేకా ఈశ్వరయ్య, పూర్వపు ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు అలుగు ఇజ్రాయేలు రాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, గ్రామ సర్పంచి కురెళ్ల వెంకట సత్యవతి, వీరవాసరం వైస్ ఎంపిపి ప్రకాష్, సిపిఎం నాయకులు బొక్కా సత్యనారాయణ, బాల విజయకుమార్, కెవిపిఎస్ నాయకులు విజయ్, అలుగు చిత్తరంజన్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిత్తరంజన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

మాట్లాడుతున్న సీతారాం, ఆనందశేఖర్, రాజగోపాల్

మత్స్యపురిపాలెం కమ్యూనిస్టు యోధులకు ఘన నివాళి

మత్స్యపురిపాలేనికి చెందిన అలుగు చిత్తరంజన్, ఆయన తండ్రి జార్జి, పినతండ్రి ఫెడరిక్, గ్రామ కమ్యూనిస్టులు అలుగు సుదర్శనం, చేరుగొండి ఏసురత్నం (మాస్టారు), అలుగు ప్రసాదరావు, నేతల నతానియేలు, నేతల సుందరరావు, నేతల ఆనందరావు, పోతుల గంగన్న, పోతుల రామ్మూర్తి, యాళ్ల సూర్యారావు, కర్రాక సుందరరావు, చిలకపాటి సంపతరావు,, పిల్లి జాన్‌ఫెడరిక్, జ్ఞానరత్నం వంటి పలువురికి సంస్మరణ సభలో ఘనంగా నివాళు లర్పించారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని నినదించారు.

భీమవరం: ఆదర్శ ప్రజాప్రతినిధి అలుగు చిత్తరంజన్ పోరాట స్ఫూర్తి నేటి యువతరానికి ఆదర్శనీయమని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అన్నారు. ఆదివారం చిత్తరంజన్ 25వ వర్ధంతి సభ పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు అధ్యక్షతన సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. తొలుత చిత్తరంజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వాసుదేవరావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ఆంజనేయులు, ఎం.రామాంజనేయులు, జి.రఫాయేలు పాల్గొన్నారు.

సిపిఎం పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి బలరాం

ఇళ్ల నిర్మాణం వేగవంతం

- 10,321 గృహ నిర్మాణాలు పూర్తి
- రూ.185.77 కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు జమ
- 21,500 మంది డ్వాక్రా మహిళలకు రూ.80 కోట్లు రుణాలు
- జగనన్న లేఅవుట్లలో ఆర్చిల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు
- గృహనిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బివి.రమణ

ప్రజాశక్తి - భీమవరం

గృహ నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయని, మరింత వేగవంతానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని గృహనిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బివి.రమణ అన్నారు. ఇప్పటివరకు 10,321 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని, మరో 10 వేల గృహాల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. గృహనిర్మాణాలకు సంబంధించి ఇప్పటి వరకు లబ్ధిదారులకు రూ.185 కోట్ల 77 లక్షలు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. 21,500 మంది డ్వాక్రా మహిళలకు ఇళ్ల నిర్మాణానికి రూ.80 కోట్లు రుణాలుగా అందించారని చెప్పారు. గృహనిర్మాణాలు, వాటి స్థితిగతులు, ప్రభుత్వం అందిస్తున్న చేయూత వంటి అంశాలపై రమణ ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

ప్రశ్న: మీ పరిధిలో ఎన్ని ప్రాంతాల్లో గృహనిర్మాణాలు సాగుతున్నాయి?

ఇఇ: నా పరిధిలో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలతోపాటు తణుకు నియోజకవర్గంలోని అత్తిలి మండలం ఉంది. దాదాపు అన్ని ప్రాంతాల్లో గృహాల నిర్మాణం సాగుతోంది.

ప్రశ్న: ఎన్ని ప్రభుత్వ లేఅవుట్లు ఏర్పాటు చేశారు? ఎంతమందికి పట్టాలిచ్చారు?

ఇఇ: 13 మండలాలు, రెండు మున్సిపాల్టీల్లో 365 జగనన్న లేటవుట్లను ఏర్పాటు చేశాం. సుమారు 25,518 మందికి ఇళ్ల పట్టాలిచ్చాం.

ప్రశ్న: ఎంతమందికి రుణాలు మంజూరు చేశారు?

ఇఇ: ప్రభుత్వం నుంచి ఇళ్ల పట్టాలు తీసుకున్న ప్రతి లబ్ధిదారునికీ రుణం మంజూరు చేశాం. సుమారు 20,018 మందికి రుణాలు మంజూరు చేయడం జరిగింది.

ప్రశ్న: ఎన్ని ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది?

ఇఇ: సొంత స్థలాల్లో నిర్మించుకున్న 7,671 ఇళ్లు, జగనన్న లేఅవుట్‌లో మరో 2,650 ఇళ్లు కలిపి సుమారు 10,321 ఇళ్ల నిర్మాణం ఇప్పటివరకు పూర్తయ్యాయి. మిగిలిన 10 వేల గహాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ఇళ్ల నిర్మాణ పనులూ వేగంగా సాగుతున్నాయి.

ప్రశ్న: లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం అందుతుంది?

ఇఇ: 90 బస్తాలు సిమెంట్, 430 కేజీల ఐరన్, 20 టన్నుల ఇసుక అందిస్తున్నాం. ఈ నిర్మాణ సామగ్రికి రూ.50,360 ఖర్చవుతుంది, రూ.లక్షా 80 వేలలో నిర్మాణ సామగ్రి మొత్తం మినహాయించి మిగిలిన సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుంది. డోర్లు, షట్టర్లు, వల్లి ఆర్ట్, పెయింట్లు అందించడం జరుగుతుంది.

ప్రశ్న: ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు బ్యాంకు నుంచి ఏమైనా రుణాలు అందిస్తున్నారా? ఇప్పటివరకు ఎంత అందించారు?

ఇఇ : డ్వాక్రా సంఘాల్లో ఉండి ప్రభుత్వ గృహం నిర్మించుకునే వారికి ప్రత్యేక రుణాలను అందించడం జరుగుతుంది. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అందిస్తున్న రూ.లక్షా 80 వేలకు అదనంగా డ్వాక్రా మహిళలకు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు అందిస్తున్నాం. ఇప్పటివరకు 21,500 మంది లబ్ధిదారులకు రూ.75 కోట్ల 25 లక్షలు రుణాలు అందించాం. డ్వాక్రాలో లేని లబ్ధిదారులను డ్వాక్రా సంఘాల్లో చేర్పించి రుణాలు అందించడం జరుగుతుంది.

ప్రశ్న: ఇళ్లు నిర్మించుకోలేని వారికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏమైనా చూపుతున్నారా?

ఇఇ: ఇల్లు నిర్మించుకోలేని లబ్ధిదారులకు ప్రత్యేక కార్యక్రమం తీసుకున్నాం. కేటగిరి-3లో కాంట్రాక్టర్‌చే ఇల్లు నిర్మించి ఇస్తున్నాం. ముఖ్యంగా ఎవరికి వారే గృహాలు నిర్మించుకునే విధంగా వారిలో అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: కొన్ని లేఅవుట్లలో పూడిక పనులు జరగలేదు. పూడికకు ఎటువంటి చర్యలు చేపట్టారు?

ఇఇ: నాలుగు లేఅవుట్లలో పూడిక పనులు జరగాల్సి ఉంది. ఈ పనులకు నిధులు మంజూరయ్యాయి. పూడిక పనులకు అవసరమైన చర్యలు చేపట్టాం.

ప్రశ్న: జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించలేదు. మీరు ఏమైనా చర్యలు చేపట్టారా?

ఇఇ: జగనన్న కాలనీల్లో కొన్నింటిని మోడల్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. కాలనీల్లో రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నాం. కొన్ని నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ప్రస్తుతం జగనన్న కాలనీల్లో రోడ్ల నిర్మాణం, పూడిక పనులు, మౌలిక వసతుల కల్పన వంటివి జరుగుతున్నాయి.

ప్రశ్న: లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందట్లేదు. మీరు ఏమైనా చర్యలు చేపట్టారా. ఎంత మేర బిల్లులు అందించారు?

ఇఇ: వివిధ దశల్లో బిల్లులు చెల్లించడం జరుగుతుంది. నిర్మాణం పూర్తయి ఆన్‌లైన్ చేసిన వారం, పది రోజుల్లో బిల్లులు చెల్లిస్తున్నాం. ఇప్పటి వరకు రూ.185 కోట్ల 77 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం. ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో బిల్లులు జమ చేయడం జరుగుతుంది.

ప్రశ్న: ఫోమ్ టెక్నాలజీ గృహాల నిర్మాణం ఎలా సాగుతుంది?

ఇఇ : ప్రభుత్వం నూతనంగా ఫోమ్ టెక్నాలజీ గృహాల నిర్మాణాన్ని తీసుకొచ్చింది. అత్తిలి మండలంలో వంద గహాలు, ఉండి లో 70, భీమవరం మండలంలో మరో 30 గృహాలు నిర్మాణంలో ఉన్నాయి. ప్రస్తుతం ఈ నిర్మాణాలు సాఫీగా సాగుతున్నాయి.

ప్రశ్న: జగనన్న లేఅవుట్లలో ఆర్చిల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారా?

ఇఇ: ప్రతి జగనన్న లేఅవుట్‌లో ఆర్చి నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. 100 గృహాల నిర్మాణం జరుగుతున్న లేఅవుట్‌లో 20 అడుగుల ఆర్చికి రూ.4.15 లక్షలు, 100కుపైగా ఇళ్ల నిర్మాణం ఉన్న లేఅవుట్‌లో 30 అడుగుల ఆర్చికి రూ.10.15 లక్షలు కేటాయించారు. ఈ ఆర్చిలను జగనన్న లేఅవుట్ల వద్ద నిర్మించనున్నాం.

ఇదెక్కడి దోపిడీ అంటే కేసులు పెడతారా

రైతు, కౌలురైతుసంఘాల నేతలపై అధికారుల తీరుకు ఖండన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆదుకోవాల్సిన అధికారులే రైతులపై కేసులు పెడతామని బెదిరించడాన్ని ఎపి రైతు సంఘం, ఎపి కౌలురైతుల సంఘం ఖండించాయి. ఈ మేరకు ఆయా సంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జుత్తిగ నరసింహమూర్తి, ఆకుల హరేరాం, కూసంపూడి సుబ్బరాజు, మామిడిశెట్టి రామాంజనేయులు ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం సాయంత్రం తుందుర్రులో ధాన్యం తూకాల్లో మోసాలు అరికట్టాలని సచివాలయ తలుపులు మూసి నిరసన తెలిపిన రైతులపై కేసులు పెడతామని అధికారులు బెదిరించి, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులుపై కేసు నమోదు చేయడం దారుణమని పేర్కొన్నారు. తుందుర్రులో ధాన్యం 40 కిలోల బస్తాకు అదనంగా నాలుగు కేజీలు పట్టడాన్ని వ్యతిరేకిస్తూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన తెలపడం అన్యాయమా, ధాన్యం ఎక్కువ తూయించుకోవడం న్యాయమా అని వారు ప్రశ్నించారు. సచివాలయం వద్దకు చేరుకున్న తహశీల్దార్, ఎంపిడిఒ, గ్రామ సర్పంచులకు రైతులు శ్రీనివాసు, పుచ్చకాయల ఆశీర్వాదం, కోయ కృష్ణ, నామాని శ్రీను తదితరులు తాము ఆర్‌బికెలో ఆన్‌లైన్ చేయించుకున్నామని, సంచులిచ్చారని, అయితే వాహనం ఏర్పాటు చేయకపోవడంతో తామే సొంతంగా వాహనం ఏర్పాటు చేసుకుని ధాన్యం మిల్లుకు తరలించామని తెలిపారని పేర్కొన్నారు. అయితే మిల్లర్లు సొరకు 44 కేజీలైతేనే దింపుకుంటామని చెప్పడంతో తాము తీవ్రంగా నష్టపోయామని తహశీల్దార్‌కు వివరించారని తెలిపారు. అయితే తహశీల్దార్ సమస్యను పరిష్కరించడం మాని ప్రయివేటు వ్యక్తుల ద్వారా అమ్మితే తమకు సంబంధం లేదని చెప్పి బాధ్యతారాహిత్యంగా వ్యహరించడమే కాకుండా ఆందోళనలో పాల్గొన్న నేతపై కేసు నమోదు చేయించారని విమర్శించారు. ఇది ముమ్మాటికి మిల్లర్లతో అధికారులు కుమ్మక్కవడమేనని, తక్షణం నూకశాతంతో కలిపి 42 కేజీలే పట్టేలా చర్యలు తీసుకోవాలని, రైతులపై కేసులు పెడతామని బెదిరించటం తగదని వారు తెలిపారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకు

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో ధాన్యం కొనుగోలుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో ఇప్పటివరకూ 13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని, 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అనుకున్నామని, వాస్తవంగా 30 లక్షల మెట్రిక్ టన్నులు వస్తోందని తెలిపారు. బయట వారు మద్దతు ధర కన్నా ఎక్కువ చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో వర్షాలు పడడంతో రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు అధికారులను సమన్వయం చేసి కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూశారన్నారు. తడిసి, రంగు మారిన ధాన్యం కన్నా ఈ సీజన్లో నూక శాతం సుమారు 80 శాతం నుండి 90 శాతం వరకూ రావడం జరిగిందని తెలిపారు. మిల్లర్లు, అధికారులు బాధ్యత ఉండడంతో రైతులు ఎక్కడా నష్టపోకుండా చర్యలు చేసుకున్నట్లు తెలిపారు. రైతులు అపోహ పడొద్దని, చెప్పుడు మాటలు నమ్మొద్దని, ప్రతి గింజా కొనుగోలు చేస్తామని తెలిపారు. అవకతవకలకు పాల్పడిన 45 మిల్లులను సీజ్ చేశామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, తాడేపల్లిగూడెం డివిజన్ ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ ఎం.సూర్యతేజ్, సివిల్ సప్లై డిఎంటి.శివరాం ప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్లు, కాలేజీల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి దిర్శిపో రామకృష్ణ, పౌరహక్కులు నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, ఎపి పట్టణ పౌర సమాఖ్య నాయకులు గార రంగారావు, సిఐటియు జిల్లా నాయకులు పి.దక్షిణామూర్తి, గుబ్బల గోపి మాట్లాడారు. కార్పొరేట్, ప్రయివేటు స్కూల్స్, కాలేజీల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలని తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకొని పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఏటా ఫీజులు పెంచుతున్నారన్నారు. ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని వక్తలు డిమాండ్ చేశారు. ఫీజులు తగ్గించే వరకూ ఆందోళన చేస్తామని రౌండ్ టేబుల్ సమావేశం హెచ్చరించింది.

30న పాలకొల్లుకు ఎంపీ మిథున్‌రెడ్డి రాక

ప్రజాశక్తి - పాలకొల్లు

గోదావరి జిల్లాల వైసిపి ప్రాంతీయ ఇన్‌ఛార్జి ఎంపీ మిథున్ రెడ్డి ఈనెల 30వ తేదీ మంగళవారం పాలకొల్లు రానున్నారు. ఆయన గత వారం పాలకొల్లు విచ్చేసి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఇటీవల సిఎం జగన్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్న నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లు సీటు కచ్చితంగా వైసిపి గెలిచేలా అవకాశాలు గురించి ఆయన పాలకొల్లులో తరచూ పర్యటించాలని అధిష్టానం ఆదేశాల మేరకు 10 రోజుల్లో 2వ సారి పాలకొల్లు విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ సోమవారం పాలకొల్లులో బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు.

సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

బీచ్ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంబీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటలో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు. పలువురు ఉక్కపోత నుండి ఉపశమనం పొందేందుకు బీచ్‌కు వచ్చి సేద తీరారు.

నేడు వైసిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - కాళ్ల

టిడిపి అధినేత చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికతో పోల్చి పేదలను దారుణంగా అవమానించారని, టిడిపి దుర్మార్గ వైఖరిని నిరసిస్తూ ఈనెల 29న ఉండి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించనున్నామని డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహరాజు ఆదివారం తెలిపారు. పెదఅమిరంలోని వైసిపి క్యాంపు కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. పెదఅమిరం, జక్కరం, కాళ్ల, జువ్వలపాలెం, ఏలూరుపాడు వంతెన, ఆకివీడు మండలం చెరుకుమిల్లి, ఐ భీమవరం, ఆకివీడు, మాదివాడ, ఉండి మండలం చెరుకువాడ, కలిసిపూడి, ఉండి, అనంతరం కాళ్ల మండలం పెదఅమిరంలో వైసిపి క్యాంపు కార్యాలయం వరకూ ఉంటుందన్నారు. ఈ ర్యాలీలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉండి : డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో సోమవారం జరగబోయే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని వైసిపి మండల అధ్యక్షుడు పెన్మెత్స వెంకట రామకృష్ణ ఆంజనేయరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టనున్న ర్యాలీ ఉదయం పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. ర్యాలీలో మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలీస్‌స్టేషన్లో సీసీ కెమెరాల ఏర్పాటు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి స్టేషన్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ పలు స్టేషన్లలో లాకప్ డెత్, కస్టడీ జరిగేవనే సమాచారం ఉంది. వాటిని నిరోధించడానికి సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు రెండు రోజులుగా ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఆధారంగా ఆయా స్టేషన్లలో విధి నిర్వహణను ఉన్నతాధికారులు తెలుసుకోవడం సులభతరం కానుంది.

ఆకివీడు మాదివాడ శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన

సృజనాత్మకతకు వేసవి శిబిరాలు దోహదం

ప్రజాశక్తి - ఉండి

ప్రతి విద్యార్థి తమలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని యండగండి శాఖా గ్రంథాలయం అధికారి ఎన్‌సిహెచ్.రామకృష్ణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం యండగండి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు రంగు కాగితాలతో రకరకాల ఆకృతుల్లో వివిధ రూపాలను తయారు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు వారిలోని సృజనాత్మకతను నిరూపించుకోవడానికి పేపర్ క్రాఫ్ట్ ఉపయోగపడుతోందన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేగేశ్న సత్యరాజ్ మాట్లాడారు.

ఆకివీడు : స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నాలుగు రోజుల నుంచి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ ట్రేడర్స్ ఫర్ మాజీ అధ్యక్షులు ఇంజినీర్ దాసరి వెంకట సత్యనారాయణ, స్థానిక న్యాయవాది నెల్లి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించారు. పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. విద్యార్థులకు పుస్తకాల విలువను వివరించారు. ఈ 15 రోజులూ వరుసగా రోజుకు ఒక పుస్తకం ఒకరి చేత చదివిస్తామని తెలిపారు.

నరసాపురం టౌన్ : నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జరుగుచున్న ఉచిత వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల సందర్భంగా ఆదివారం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. అనంతరం పిల్లలకు యోగా, మెడిటేషన్‌పై గెల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. విజయలక్ష్మి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సాంబమూర్తి ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించినారు. అనంతరం పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.శ్రీనివాస్, జీవన్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, చైర్మన్ కొల్లాటి రామారావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రసాద వితరణ చేశారు. బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మోడీ గ్రామానికి చెందిన దాసరి కిరీటి వెంకట సాయి, నరసాపురంకు చెందిన తోట శ్రీదేవి నగేష్ సంయుక్తంగా ఆలయ ప్రాంగణంలో చలివేంద్రం వద్ద వారు సమకూర్చిన మజ్జిగను యాత్రికులకు అందజేశారు.

వాలంటీర్లకు పురస్కారాలు అందజేసిన ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్

వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వాలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మండల వాలంటీర్లను సత్కరించి వారికి సేవా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి కనక లక్ష్మీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాలంటీర్ల వల్లే సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయన్నారు. అనంతరం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి చిట్టూరి కనక లక్ష్మి, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, యడ్ల తాతాజీ, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజులు నాయుడు పాల్గొన్నారు.

ములపర్రులో అంబేద్కర్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని ములపర్రులో అంబేద్కర్ భవనాన్ని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోషేరాజు మాట్లాడుతూ దళితులందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. అప్పుడే ఏదైనా సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మోషేను రాజు

రారెత్తిస్తున్న రోహిణీ..

- 39 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- బయటికి రావాలంటే జనం బెంబేలు
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి


జువ్వలపాలెంలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - కాళ్ల

అసలే ఎండాకాలం.. ఆపై రోహిణీ కార్తె దెబ్బకు జనం బెంబేలెత్తిపోతున్నారు. భానుడు తన ప్రభావం చూపించడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. జిల్లాలో గత పది రోజుల నుంచి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 40 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి.

పక్షం రోజులు వేడి గాలులు..

రోహిణీ కార్తెలో ఒక పక్క ఎండ, మరో పక్క ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ సంవత్సరం రోహిణీ కార్తె మే 25న ప్రారంభమై జూన్ 8వ వరకూ ఉంటుంది. రోహిణీ కార్తె 15 రోజులూ వేడి గాలులు, ఎండ తీవ్రత, అగ్ని ప్రమాదాలు, ఉక్కపోత ఎక్కువగా ఉంటాయి. వేడిగాలుల వల్ల చంటి పిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఫ్యాన్లు వేసుకున్నప్పటికీ గాల్పులకు జనం విలవిల్లాడిపోతున్నారు. అడుగు బయట పెట్టాలంటే వణికిపోతున్నారు.

కనీసం కూలర్ వేసుకొని పడుకుందామంటే అందులో కూడా వేడిగాలులు రావడంతో రాత్రిపూట నిద్ర కరువవుతోంది. ఎసిలు ఉంటే తప్ప ఉపశమనం లేదు. చాలామంది మధ్యతరగతి ప్రజలు కూడా ఎసిలను ఆశ్రయిస్తున్నారు. ఎండ తాకిడికి ఉదయం 11 గంటలకే ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎక్కువగా మట్టికుండలో నీరు తాగాలి. మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, రాగి జావ, ఫలుదా వంటివి ఎక్కువగా తాగడం వల్ల ఆరోగ్యానికి అనుకూలంగా ఉంటుంది. కొంత ఉపశమనం లభిస్తుంది.

తినకూడని పదార్థాలు..

మసాలాకు సంబంధించిన ఆహార పదార్థాలు, వేపుళ్లు, పచ్చళ్లు, ఆయిల్ ఫుడ్ తినకూడదు. కాటన్ దుస్తులు ధరించాలి. తెలుపు, లైట్ రంగు కలిగిన కాటన్ దుస్తులు ధరిస్తే ఉష్ణతాపం నుండి ఉపశమనం లభిస్తుంది. శారీరక తాపం తగ్గుతుంది. చిన్నపిల్లలకు ఉష్ణోగ్రత తీవ్రతను బట్టి తడి గుడ్డతో తుడవాలి.

కారణజన్ముడు ఎన్‌టిఆర్

శత జయంతి ఉత్సవాల్లో టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఉండి

కారణజన్ముడు ఎన్‌టిఆర్ అని టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అన్నారు. ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి తెలుగుదేశం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కరిమెరక నాగరాజు మాట్లాడుతూ ఆత్మగౌరవ నినాదంతో తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసిన తొమ్మిది నెలల్లోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఎన్‌టిఆర్‌కు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, గ్రామ అధ్యక్షులు కాగిత వెంకట సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న సీతారామలక్ష్మి

కాళ్ల : పెదఅమిరంలో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన కార్యదర్శి వెంకట కృష్ణ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ప్రవేశపెట్టిన పథకాల వల్లే ఇప్పటి సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో అలుగు రత్నరాజ్, యండమూరి సింహాద్రి, తాళ్లపూడి అప్పారావు, అరేపల్లి సాయి పాల్గొన్నారు.

ఆచంట : ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, వల్లూరు, ఆచంట వేమవరం తదితర గ్రామాల్లో ఆయన విగ్రహాలకు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆశయాలకు అను గుణంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి టి.పృథ్వీకుమార్, టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, బీరా నరసింహమూర్తి, తమ్మినీడి ప్రసాద్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : ఎన్‌టిఆర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని బివి.రాజు పార్కు వద్ద ఉన్న విగ్రహానికి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్య రాజు అధ్యక్షతన టిడిపి సీనియర్ నాయకుడు మద్దుల రాము ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నందమూరి అభిమాన సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడారు. మహానాడు సభకు జిల్లా వ్యాప్తంగా 7 నియోజకవర్గాల నుంచి లక్షల మంది తరలి వెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: పూలపల్లి గ్రామంలో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా ఆయన విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్ ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో పాముల రజనీకుమార్, అంగర చిన్న, శ్రీహరి రాజు, గుబ్బల ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకొల్లు : ఎన్‌టిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాల వల్లే పేదలు నేడు హాయిగా జీవిస్తున్నారని టిడిపి నేతలు తెలిపారు. ఎన్‌టిఆర్ శతజయంతి సందర్భంగా ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జిల్లా బిసి అధ్యక్షులు కర్నేని గౌరునాయుడు, మల్లంపల్లి పకీర్ బాబు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని గొల్లగూడెంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజ్ ఆధ్వర్యంలో నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో నిర్వహిస్తున్న టిడిపి మహానాడు కార్యక్రమానికి తరలివెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, నాయకులు కలిదిండి కుమార్‌బాబు, పొన్నపల్లి శివ, బొల్ల చంటి, పాల రాంబాబు, డోల్ల రత్నంరాజు పాల్గొన్నారు.

తణుకు : టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి.రామారావు శతజయంతి వేడుకలు ఆదివారం పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర థియేటర్ సెంటర్లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, టిడిపి శ్రేణులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ సినీ, రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. ఎన్‌టిఆర్ ఆశయాలకు అనుగుణంగా చంద్రబాబు పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, నరసాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ పరిమి వెంకన్నబాబు, పట్టణ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ పాల్గొన్నారు.

తణుకులో..

పట్నాల శ్రీనివాసరావు ధన్యజీవి

సంతాప సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం, కేశవరం ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి 40 సంవత్సరాల పాటు అవిశ్రాంత పోరాటం చేసిన పట్నాల శ్రీనివాసరావు ధన్యజీవి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. ఆదివారం సరిపల్లిలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో జరిగిన శ్రీనివాసరావు సంతాప సభకు ఆ పార్టీ మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి అధ్యక్షత వహించారు. సభలో తొలుత శ్రీనివాసరావు చిత్రపటానికి మంతెన సీతారాం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ శ్రీనివాసరావు తన చేతి వృత్తి చేసుకుంటూ ప్రజాఉద్యమాల్లో అగ్రభాగాన నిలిచాడన్నారు. కేశవరం, పిప్పర ప్రాంతాల్లో పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణంలో స్థానిక పెత్తందార్లను ఎదిరించి ముందుకు సాగాడని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రీనివాస్ తపించేవారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ గణపవరం ప్రాంతంలో కార్మికోద్యమం నిర్మాణంలో శ్రీనివాస్ పాత్ర చిరస్మరణీయమన్నారు. సభలో సిపిఎం ఏలూరు జిల్లా నాయకులు గుడిపాటి నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కె.సోమరాజు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు షేక్ వలీ, సిపిఎం నేత పి.గోవింద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.పెంటారావు, ఎస్.సంజీవరావు, గుత్తుల శ్రీను, చిన్న నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం

పెడాయికోడు డ్రెయినేజీ ప్రక్షాళన

ప్రజాశక్తి - ఉండి

ఎన్నో ఏళ్లుగా ఉండి పంచాయతీ పరిధిలో ప్రధాన సమస్యగా ఉన్న పెడాయికోడు డ్రెయినేజీ ప్రక్షాళన చేయడం అభినందనీయమని డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. ఆదివారం ఉండి గౌడపేటను ఆనుకొని ఉన్న పెడాయికోడు మురుగు డ్రెయినేజీ ప్రక్షాళన పనులను పివిఎల్ నరసింహారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండిలో గత పాలకులు మురుగు సమస్య ప్రధానంగా ఉన్న పెడాయికోడు డ్రెయినేజీని పట్టించుకోలేదని, ఆ డ్రెయినేజీ పూడుకుపోవడంతో సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. డ్రెయినేజీ చుట్టుపక్కల నివసించేవారు డ్రెయినేజీ నుంచి వెలువడే దుర్వాసనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అభివృద్ధిలో భాగంగా నేటి గ్రామ పంచాయతీ పాలకవర్గం పెడాయికోడు ప్రక్షాళనకు పూనుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి సర్పంచి కమతం సౌజన్యబెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణవర్మ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఎంపీటీసీ వీరమల్లు సత్యవతి శ్రీనివాస్, నాయకులు బడుగు బాలాజీ, తాడేపల్లి శ్రీరామచంద్రమూర్తి, అంగర రాంబాబు, శేషాద్రి శ్రీనివాస్, రాయి సతీష్, పంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న పివిఎల్ నరసింహారావు

మెరుగైన వైద్య సేవలందించాలి

ఎబిఎస్‌వికె వైద్య సహాయ కేంద్రంలో డిఎంహెచ్‌ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్ఒ మహేశ్వరరావు కోరారు. ఆదివారం పట్టణంలోని మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఆదివారం పక్షవాతం, ఫిట్స్ బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. తొలుత వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడకు చెందిన డాక్టర్ గోపాళం శివన్నారాయణ మెడికల్ క్యాంపులో మన హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ డి,సందీప్‌వర్మ తదితరులు పాల్గొని వైద్య సేవలందించారు. తక్కువ ధరలకే అవసరమైన ఔషధాలను, ఇన్సులిన్ నెలలవారీగా అందించారు. రోగులకు బిపి, షుగర్, అవసరమైన వారికి ఇసిజి పరీక్షలు చేశారు. వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పలువురు రోగులకు వసుధ ఫౌండేషన్ ఉచితంగా మందులను అందజేసింది. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు, కోఆర్డినేటర్ ఎంవి.రామరాజు, అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రానికి చెందిన వి.రాధాకృష్ణ, ట్రస్టీ బి.వాసుదేవరావు, జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ మల్లుల శ్రీనివాస్, సిహెచ్.మావో అజయ్ కుమార్, ప్రమోద్, సాహితీ స్రవంతి కన్వీనర్ చైతన్యప్రసాద్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పి.సీతారామరాజు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు శిరీష్, సూర్యచంద్రరాజు, ఎం.వైకుంఠరావు, జి.రఫాయేల్ పాల్గొన్నారు.


డిఎంహెచ్‌ఒకు స్వాగతం పలుకుతున్న వసుధ ఫౌండేషన్ కన్వీనర్

ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలకు తరలిన నేతలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాజమండ్రిలో జరిగే ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలకు మండలం నుంచి 3,500 మంది కార్యకర్తలతో వివిధ వాహనాలపై ఆదివారం వెళ్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివిధ హోదాల్లో ఉన్న కార్యకర్తలను 300 ఆటోల్లో, 40 కార్లలో వెళ్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయ ఖాళీలను బ్లాక్ చేయడం సరికాదు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఉపాధ్యాయుల బదిలీల జిఒ 47లో ఉన్న అసంబద్ధతలను సరిచేయాలని ఉద్యోన్నతులను మాన్యువల్‌గా నిర్వహించాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయ ఖాళీలను బ్లాక్ చేయడం సరికాదని, అన్ని ఖాళీలను చూపించాలని తెలిపారు. ముందుగా గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలని, ఆ తర్వాత ఉద్యోన్నతులు నిర్వహించాలని తెలిపారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ బదిలీలు నిర్వహించి, ఆతర్వాత స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ నిర్వహించాలని, ఆఖరున సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను నిర్వహించాలని పేర్కొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

మహిళలు శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఆదివారం నరసాపురం పురపాలక సంఘంలోని మెప్మా విభాగంలో అంతర్జాతీయ రుతుస్రావ పరిశుభ్రతా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, వైస్ ఛైర్‌పర్సన్ కామన నాగిని, డాక్టర్ మోహన, డాక్టర్ సోనియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన మాట్లాడుతూ రుతుశ్రావ సమయంలో పరిశుభ్రంగా ఉండాలన్నారు. మంచి ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించారు.

సుభద్రమ్మకు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

శతాధిక వృద్ధురాలు సుభద్రమ్మ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మొగల్తూరు

రామన్నపాలెం పంచాయతీ పరిధి లక్కువారి తోటలో శతాధిక వృద్ధురాలు మామిడిశెట్టి సుభద్రమ్మ (115)కు పుట్టినరోజు వేడుకలను ఆదివారం కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆచంట మండలం కోడేరుకు చెందిన సుభద్రమ్మకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, సుమారు 60 మంది మనవలు, ముని మనవలు ఉన్నారు. ఆమె భర్త గతంలోనే మృతి చెందారు. 115 సంవత్సరాలు ఉన్న సుభద్రమ్మ ఆమె పని ఆమే చేసుకుంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె కోడేరు నుండి లక్కు వారి తోటలో ఉన్న చిన్న కుమార్తె కంకటాల యేసుమని ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా పుట్టినరోజు వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి పలువురికి పంపిణీ చేశారు. మామిడిశెట్టి సుభద్రమ్మ 115 వేడుకలను బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు శీలబోయిన సుబ్బారావు, కుక్కల సత్యన్నారాయణ, కండిబోయిన సుబ్రహ్మణ్యం, జక్కంశెట్టి బాబూరావు , గణపతి, పితాని.ముత్యాలరావు, వానం రాజేష్ పాల్గొన్నారు.

పాలకొల్లులో ఫ్లెక్సీ రగడ

పోలీస్‌స్టేషన్లో జనసేన నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో వైసిపి, జనసేన మధ్య ఫ్లెక్సీ వార్ జరుగుతోంది. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను అవమానపరుస్తూ టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు, లోకేష్ కూర్చున్న పల్లకి మోస్తున్నట్లు చిత్రీకరించిన ఫ్లెక్సీని వైసిపి నేతలు పట్టణంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేశారు. దీంతో వైసిపి నేతలపై చర్యలు తీసుకోవాలని జనసేన నేత పితాని వెంకటేష్ సారధ్యంలో ఊరేగింపుగా వెళ్లి నిరసన తెలిపిన జనసేన నేతలు పట్టణ సిఐకు ఫిర్యాదు చేశారు. వైసిపి నేతలు తక్షణం ఫ్లెక్సీలు తొలగించకపోతే జనసేన తరపున నిరసన తెలుపుతూ పలు కూడళ్లలో ప్రజలను మోసగిస్తున్న సిఎం జగన్ అంటూ సిఎం చేసిన అవినీతిపై భారీ ఫ్లెక్స్ బ్యానర్లను తాము కూడా ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు.

సిఐకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814